సాక్షి తిరుపతి

సోమవారం । 31 । జూలై । 2023



కళలతో సంస్కృతి పరిరక్షణ

తిరుపతి మహతి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాటక పోటీలు ఆదివారంతో ముగిశాయి. - IIలో



సాయినాథుని ఊరేగింపు

శ్రీకాళహస్తిలో సాయిబాబా సత్సంగ కేంద్రం వార్షికోత్సవం సందర్భంగా సాయి చిత్రపటాన్ని ఊరేగించారు. - IIలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	27
చిత్తూరు	36	26
తిరుమల	31	22
గూడూరు	37	28
నగరి	37	27

న్యూస్‌రీల్

గంగమ్మ సేవలో కేంద్ర మంత్రి



సారె తీసుకువస్తున్న కేంద్ర మంత్రి భారతి ప్రవీణ్ పవార్

తిరుపతి కల్చరల్ : తిరుపతి గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ తల్లిని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సాంప్రదాయ సారెను అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుండాల గోపీనాథ్, నాయకులు సుబ్రమణ్యం యాదవ్, దీపక్, చెంగారెడ్డి, సురేష్ స్వామి, రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు యాదవ్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో పోషకాల 'ఫోర్టిఫైడ్'



రాజా రఘువీర్

తిరుపతి అర్బన్ : రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి రాజారఘువీర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రతా చట్టం కింద రైస్ కార్డుదారులకు 3 నెలల నుంచి మధ్యస్త, సన్నకారు బియ్యాన్ని సార్టెక్స్ చేసి ఫోర్టిఫైడ్ బియ్యంగా మార్చి సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ బియ్యంలో విటమిన్–బి12, ఫోలిక్ యాసిడ్, ఐరన్ తదితర మెరుగైన పోషకవిలువలు ఉంటాయని, ఆరోగ్య సమస్యలను అధిగమించేందుకు ఉపకరిస్తాయని వివరించారు. బియ్యం కడిగే సమయంలో ఫోర్టిఫైడ్ రైస్ పైకి తేలుతుందని, వాటిని తొలగించకుండా కలిపి వండుకోవాలని సూచించారు. ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కడిగిన నీటితో వంట చేసుకోవడం ఉత్తమమని చెప్పారు. అలాగే రేషన్ దుకాణదారులు సక్రమంగా కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. వినతులు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. స్పందనకు అన్ని శాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. కార్యాలయంలోనే ఉంటూ సబార్డినేట్లను పంపితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజలు వివిధ సమస్యలపై అందించిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని సూచించారు.

జాతీయ బాలల పురస్కారానికి దరఖాస్తులు

తిరుపతి అర్బన్ : వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన 18ఏళ్లలోపు బాలబాలికలు జాతీయ పురస్కారాల కోసం ఆగస్టు 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి జయలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలల పురస్కారాలు–2024కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. అర్హులైన వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏడబ్ల్యూఆర్‌డీఎస్.జీవ్వో.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 78,115 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 30,243 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.76 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేనివారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

కాణిపాకం కిటకిట

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి భక్తులు తాకిడి మొదలవడంతో కంపార్ట్‌మెంట్లు, క్యూలు నిండిపోయాయి. స్వామివారి దర్శనానికి సుమారు 4 గంటలుపట్టింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తగు చర్యలు తీసుకొని స్వామివారి దర్శనం కల్పించారు.

గఘన విజయం

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మరోమారు సత్తా చాటింది. వాణిజ్యపరమైన ప్రయోగాల్లోనూ తిరుగులేదని నిరూపించింది. ఇస్రో శాస్త్రవేత్తల అవిశ్రాంత కృషి ఫలించింది. పీఎస్ఎల్‌వీ సీ56 గగన తలం వైపు దూసుకెళ్లింది. విదేశీ ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఈ క్రమంలోనే పీఎస్–4లో భాగంగా ఓ ప్రత్యేక పరికరంతో సరికొత్త పరిశోధనలు చేపట్టనుంది. శాటిలైట్స్‌కు అడ్డంకిగా మారే అంతరిక్ష వ్యర్థాలను పసిగట్టి పక్కకు తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.



నింగిలోకి బయలుదేరుతున్న పీఎస్ఎల్‌వీ

- కరతాళధ్వనుల నడుమ నింగికెగసిన రాకెట్
- 58వ పర్యాయం పీఎస్ఎల్‌వీ ప్రయోగం
- కక్ష్యలోకి చేరిన సింగపూర్ ఉపగ్రహాలు
- వాణిజ్యపరంగా మరోసారి సత్తా చాటిన ఇస్రో
- షార్ శాస్త్రవేత్తలకు అభినందనల వెల్లువ

సూళ్లూరుపేట : సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి ఆదివారం ఉదయం 6.31 గంటలకు పీఎస్ఎల్‌వీ సీ56 ఉపగ్రహ ప్రయోగాన్ని భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) విజయవంతంగా నిర్వహించింది. ఈ ఏడాదిలో ఇది ఆరో ప్రయోగం కాగా,, వాణిజ్యపరంగా మూడో ప్రయోగం కావడం విశేషం. షార్ శాస్త్రవేత్తలు శనివారం ఉదయం 5.01 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియ ప్రారంభించారు. 25.30 గంటలు కొనసాగిన అనంతరం పీఎస్ఎల్‌వీ సీ56 రాకెట్ తొలి సంధ్యవేళలో ఉదయభానుడి లేత కిరణాలను చీల్చుకుంటూ రివ్వుమంటూ గగనతలం వైపుకు దూసుకెళ్లింది. ఈ ప్రయోగంలో 422 కిలోలు బరువు గల సింగపూర్‌కు చెందిన 7 ఉపగ్రహాలను మోసుకెళ్లింది. భూమికి 535 కిలోమీటర్ల ఎత్తులోని నియో ఆర్బిట్ (భూ సమీప కక్ష్య)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. దీంతో ప్రపంచంలోనే వాణిజ్యపరమైన ప్రయోగాలకు తిరుగులేని దేశంగా భారత్ ఆవిర్భవించింది.

పీఎస్–4తో మరో పరిశోధన

పీఎస్ఎల్‌వీ సీ56 రాకెట్‌లోని నాలుగో దశ (పీఎస్–4)తో సరికొత్త పరిశోధనలకు ఇస్రో శ్రీకారం చుట్టింది. ఏడు ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తర్వాత డీఆర్బిటింగ్ ఎక్స్‌పెరిమెంట్ చేయనున్నారు. భూ సమీప కక్ష్యలో ఉన్న ఉపగ్రహ వ్యర్థాలను తొలగించేందుకు ప్రయోగాత్మకంగా చర్యలు చేపట్టనున్నారు. భూమికి 535 కిలోమీటర్లు ఎత్తులో ఉపగ్రహాలను ప్రవేశపెట్టిన తర్వాత పీఎస్– 4 అక్కడ నుంచి 300 కిలోమీటర్లు కిందికి వచ్చి వ్యర్థాలను పసిగట్టి వాటిని దూరంగా జరిగేలా చేస్తుంది. స్పేస్‌లో వున్న డెబ్రిస్ (అంతరిక్షంలో వ్యర్థాలు) తొలగించి కొద్ది రోజుల తర్వాత సముద్రంలో పడిపోయేలా శాస్త్రవేత్తలు పీఎస్–4ను డిజైన్ చేయడం విశేషం.

సందడే సందడి

పీఎస్ఎల్‌వీ సీ56 ప్రయోగాన్ని వీక్షించేందుకు ఏపీతో పాటు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నంచి నుంచి సుమారు 10 వేలమంది వరకు విచ్చేశారు. సందర్శకుల కోసం షార్ కేంద్రం వారు శ్రీహరికోటలో ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అలాగే పులికాట్ సరస్సు పరిసరాల్లో సైతం పెద్దసంఖ్యలో ప్రజలు చేరి ప్రయోగాన్ని వీక్షించారు. రాకెట్ నింగికెగసిన సమయంలో ప్రేక్షకుల కరతాళధ్వనులతో ఆ ప్రాంతం మార్మోగింది.

ఎంపీ, ఎమ్మెల్యే అభినందనలు

పీఎస్ఎల్‌వీ సీ56 ప్రయోగం విజయవంతం కావడంతో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హర్షం వ్యక్తం చేశారు. భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.






మొదటిదశలో మండుతూ.. రెండో దశ వెళుతూ..



మూడోదశలో దూసుకెళుతూ..



నాలుగోదశలో ఉపగ్రహాన్ని కక్ష్యలోకి వదిలిపెడుతూ..

వివిధ దశల్లో ప్రయోగం

- పీఎస్ఎల్‌వీ సీ56 రాకెట్ 44.4 మీటర్లు పొడవు.
- రాకెట్ ప్రయోగ సమయంలో 228.642 టన్నుల బరువుతో నింగికి పయనమై 23 నిమిషాల్లో శాస్త్రవేత్తలు ప్రయోగాన్ని పూర్తి చేశారు.
- మొదటిదశలో 139 టన్నుల ఘన ఇంధనం సాయంతో ఏడు ఉపగ్రహాలను మోసుకుని నింగికి పంపించారు.
- 139 టన్నుల ఘన ఇంధనంతో మొదటి దశను 109.8 సెకెండ్లలో పూర్తి చేశారు.
- 110 సెకెండ్లకు రెండోదశ ప్రారంభించారు.
- రాకెట్ నింగి వైపునకు వెళుతున్న సమయంలో 184.9 సెకెండ్లకు రాకెట్ శిఖర భాగాన అమర్చిన ఉపగ్రహాలకు సంబంధించి హీట్‌షీల్డ్‌లు విడిపోయాయి
- అనంతరం 40 టన్నుల ద్రవ ఇంధనాన్ని వినియోగించి 262.3 సెకెండ్లకు రెండోదశను పూర్తి చేశారు.
- 263.3 సెకెండ్లకు మూడోదశను ప్రారంభించారు.
- 76 టన్నుల ఘన ఇంధనం సాయంతో 583.6 సెకెండ్లకు మూడో దశను పూర్తిచేశారు.
- 848.8 సెకెండ్లకు నాలుగోదశను ప్రారంభించారు.
- 1120.5 సెకెండ్లకు నాలుగో దశను కటాఫ్ చేసి దాని కి పైభాగంలో అమర్చిన ఏడు ఉపగ్రహాలను ఒక్కొ క్కటిగా కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు.
- 1167.5 సెకెండ్లకు 352 కిలోలు బరువు కలిగిన డీఏ–ఎస్ఏఆర్ (షార్ట్ ఫర్ సింథటిక్ అపార్చర్ రాడార్)అనే ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్‌ను భూమికి 535 కిలోమీటర్ల ఎత్తులోని నియో ఆర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు.
- 1177.9 సెకెండ్లకు మూడు కేజీల బరువు గల నులయిన్ అనే ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు.
- 1222.6 సెకెండ్లకు 13 కిలోలు బరువు గల ఓఆర్‌బీ–12 స్ట్రైడర్ అనే ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు.
- 1236.9 సెకెండ్లకు 3.5 కేజీల బరువు టల గలాసియో అనే ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు.
- 1267.9 సెకెండ్లకు నాలుగు కిలోల బరువు గల స్కూబ్–11 అనే ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు.
- 1327.5 సెకెండ్లకు 24 కిలోల బరువు గల ఆర్కేడ్ అనే ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు.
- 1382 సెకెండ్లకు (23 నిమిషాల వ్యవధిలో) వెలాక్స్–ఎంఎం అనే చివరి ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టి ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు

అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. పుంగనూరు పట్టణంలో ఆదివారం నాలుగో రోజు వార్డు బాట కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. వార్డు బాటలో ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి వస్తున్న స్పందనే ఇందుకు నిదర్శమని పేర్కొన్నారు. పుంగనూరును ఒకే కుటుంబం 30 సంవత్సరాలు పాలన చేసి మౌలిక వసతులు కల్పించడంలో చేయడంలో కూడా విఫలమైందన్నారు.



వార్డుబాటలో అభివాదం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి
- ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశించిన మేరకు కులాలు, మతాలు, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. ఎక్కడికి వెళ్లినా తాము పథకాల అమలుతో సంతోషంగా ఉన్నామని ప్రజలు పేర్కొంటుండడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందిస్తున్నాము కాబట్టే ప్రజలంతా వైస్సార్‌సీపీ వైపే ఉన్నారని పేర్కొన్నారు. పుంగనూరును ఒకే కుటుంబం 30 సంవత్సరాలు పాలన చేసినా కనీస అవసరాలైన తాగునీటి సమస్యను కూడా పరిష్కరించలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మౌలిక వసతుల కల్పనకు రూ.కోట్లు ఖర్చు చేశామన్నారు. గత 10 సంవత్సరాలు ముందు మున్సిపాలిటీలో జరగని అభివృద్ధిని నాలుగన్నరేళ్లలో చేపట్టామన్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ పనితీరుపై కేంద్రరాష్ట్ర అవార్డులు లభించాయని తెలిపారు. మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, రూపురేఖలు మారుస్తున్నట్లు పేర్కొన్నారు. కోట్లాది రూపాయలతో పట్టణాన్ని సుందరంగా రూపుదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టీటీడీ ట్రస్టుబోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, ఎంఆర్‌సీ రెడ్డి, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకావెంకటాచలపతి, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం పాల్గొన్నారు.

తక్షణం సమస్యల పరిష్కారం

జగనన్న సురక్ష కార్యక్రమం, వార్డుబాటలో వచ్చిన సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు విడుదల చేస్తామని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. వార్డుబాటలో వచ్చే వినతులపై ఎప్పటికప్పుడు అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చి పరిష్కరిస్తున్నామన్నారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు తెలిపారు.వార్డుబాటలో ఇందిరా సర్కిల్ నుంచి ఎంఎస్ఆర్ థియేటర్, కౌసర్ నర్సింగ్‌హోమ్ ప్రాంతాల్లో తారు రోడ్డు వేయాలని కౌన్సిలర్ అర్షద్‌అలితో పాటు ప్రజలు కోరారు. స్పందించిన మంత్రి రూ.28 లక్షలతో తారు రోడ్డు పనులను ఆదివారం శరవేగంగా మిషన్లతో వేయించడంతో ఆప్రాంత వాసులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

24 గంటల్లో పథకాలు...

అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో సచివాలయాలకు వచ్చిన అర్జీదారులకు 24 గంటల్లో పథకాలను అందిస్తారని పేర్కొన్నారు. ధ్రువపత్రాలు, సర్టిఫికెట్లను తక్షణమే అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. జగనన్న సురక్ష సోమవారంతో ముగుస్తుందని, ప్రజలు సమస్యలను సచివాలయాల్లో విన్నవించాలని మంత్రి కోరారు.

అసత్యాల్లో చంద్రబాబుకు ఆస్కార్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : అసత్యాలు చెప్పడంలో చంద్రబాబుకు ఆస్కార్ అవార్డు ఇవ్వవచ్చని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆదివారం తిరుపతి 19వ డివిజన్ ఎమ్మార్‌పల్లెలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు చెప్పిన అబద్ధాలనే మళ్లీ మళ్లీ చెప్పి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. సొంత మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన నమ్మకద్రోహి చంద్రబాబు అని విమర్శించారు. తన 14 ఏళ్ల పాలనలో రాయలసీమకు ఇది చేశానని చెప్పుకోలేని సీమ ద్రోహి అని ఆరోపించారు. శ్రీబాగ్ ఒప్పందంపై చంద్రబాబుకు కనీస అవగాహన లేదని, నీటి ప్రాజెక్టుల గురించి ఏమీ తెలియదని వెల్లడించారు. ఎవరో అందజేసిన తప్పుడు సమాచారానికి తన అబద్ధాలను జోడించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎల్లో మీడియా సహకారంతో బురదజల్లేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమకు వైఎస్ కుటుంబం వల్లే మేలు చేకూరిందని తెలిపారు. చంద్రబాబు రాయలసీమకు మేలు చేసి ఉంటే ఇక్కడి ప్రజలు ఎందుకు టీడీపీని మూడు స్థానాలకే పరిమితం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. చంద్రబాబుకు స్వార్థ, వర్గ ప్రయోజనాలే తప్ప ప్రాంతాల అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర, రాయలసీమను చిన్నచూపు చూడడం వల్లే ఆ ప్రాంతాల్లో టీడీపీని తరిమికొట్టారని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ భూస్థాపితం తథ్యమని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ శిరీష, డిప్యూటి మేయర్ ముద్ర నారాయణ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే జిల్లా అభివృద్ధి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి శ్యామలారావు

తిరుపతి అర్బన్ : అన్నిశాఖల అధికారుల సమష్టి కృషితోనే జిల్లా అభివృద్ధి సాధ్యమని ప్రత్యేకాధికారి, ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు స్పష్టం చేశారు. ఆదివారం కలెక్టరేట్ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా శాఖలపై అధికారులకు పట్టు సాధించాలని సూచించారు. ప్రతి పనికీ కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌పై ఆధారపడకుండా ఎవరి పరిధిలోని సమస్యలను వారే పరిష్కరిస్తే జిల్లా యంత్రాంగంపై భారం తగ్గుతుందని తెలిపారు. అర్జీదారుడు సంతృప్తిం చెందేలా సమాధానం ఇవ్వాలని స్పష్టం చేశారు. జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాల్లో వచ్చే వినతులను వందశాతం పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, అలాగే మాన్యువల్ రికార్డులు సైతం ఉండాలని సూచించారు. కచ్చితమైన వివరాలతో రికార్డులు రూపొందించాలని తెలిపారు. సమావేశంలో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, జేసీ డీకే బాలాజీ, ఆర్డీఓలు కనకనరసారెడ్డి, రామారావు, చంద్రముని, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

తనపల్లె సచివాలయం తనిఖీ

తిరుపతి రూరల్ మండలం తనపల్లె సచివాలయాన్ని ప్రత్యేకాధికారి తనిఖీ చేశారు. ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ సెంటర్,అంగన్ వాడీ కేంద్రం, ఓటేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చేపట్టిన నాడు–నేడు పనులను పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా అని ఆరా తీశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో అందించిన ధ్రువీకరణ పత్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్ట చేశారు. అంగన్‌వాడీల్లో సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆర్‌బీకేల పనితీరును మెరుగుపరచాలని సూచించారు. విలేజ్ హెల్త్‌సెంటర్లలో పకడ్బందీగా వైద్యసేవలందించాలని కోరారు. డీపీఓ రాజశేఖర్‌రెడ్డి, పీడీ జయలక్ష్మి, డీఎల్‌డీఓ సుశీలాదేవి, ఆదిశేషారెడ్డి, డీఏఓ ప్రసాద్‌రావు, డీపీఓం శ్రీనివాసరావు వైద్యాధికారులు నీలిమ, ఉషశ్రీ, ప్రధానోపాధ్యాయిని జమున, వైస్ ఎంపీపీ మాధవ రెడ్డి పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంపై అవగాహన



విద్యార్థులతో ప్రొఫెసర్ గణేష్

ఏర్పేడు : మండలంలోని జంగాలపల్లె వద్ద ఆదివారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)లో 34 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 81 మంది 9వ తరగతి విద్యార్థులకు రసాయన శాస్త్రంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసర్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ గణేష్ మాట్లాడుతూ మానవజాతి అభ్యున్నతికి రసాయన శాస్త్రం ఎంతో ఉపయోగపడిందన్నారు. యువ విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడమే కాకుండా రసాయన శాస్త్రంపై మక్కువ పెంచేందుకే ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయమోహన్ పిళ్లై, రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి పాల్ లూయిస్, డాక్టర్ యూసుఫ్ హమీద్ పాల్గొన్నారు.

తిరుత్తణి- తిరుపతికి ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్ : ఆడికృత్తికను పురస్కరించుకుని ఆగస్టు 8, 9వ తేదీల్లో తిరుత్తణి–తిరుపతికి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. తిరుపతి జిల్లా నుంచి 80, తమిళనాడు నుంచి 38 సర్వీసులను నడిపేందుకు రెండు రాష్ట్రాల ప్రజారవాణా అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. జిల్లా నుంచి ప్రధానంగా తిరుపతి, పుత్తూరు, శ్రీకాళహస్తి, సత్యవేడు, నాయుడుపేట నుంచి తిరుత్తణికి అదనపు సర్వీసులు నడుపుతున్నామని అధికారులు వెల్లడించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కళలతో సంస్కృతి పరిరక్షణ



నాటక పోటీల ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తదితరులు



తిరుపతి గంగమ్మ నాటకంలోని దృశ్యం

- ఘనంగా ముగిసిన అభినయ ఆర్ట్స్ జాతీయ నాటక పోటీలు

తిరుపతి కల్చరల్ : భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కళలతో సాధ్యమని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఈనెల 23 నుంచి 8 రోజుల పాటు మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన అభినయ ఆర్ట్స్ జాతీయ స్థాయి నాటక, నృత్య పోటీలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ప్రత్యేక అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, డాక్టర్ పీసీ రాయులు, శ్రీకాళహస్తి ఆర్డీఓ కేఎస్.రామరావు, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ కృష్ణారెడ్డి, సైకం గ్రూప్ చైర్మన్ సైకం జయచంద్రారెడ్డి, విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ ఎక్కడ కళలు వర్ధిల్లుతాయో అక్కడ సుభిక్షత ఉంటుందన్నారు. కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. అభినయ ఆర్ట్స్ బీఎస్ రెడ్డిని కోరగానే జాతరలో తిరుపతి గంగమ్మ నాటకాన్ని రూపొందించి ప్రదర్శించడం అభినందనీయమన్నారు. తిరుపతి గంగమ్మ నాటక పుస్తకాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. సైకం జయచంద్రారెడ్డి మాట్లాడుతూ కళాకారుల అభ్యున్నతికి కృష్ణాపురం వద్ద అర ఎకరా అందిస్తున్నట్లు తెలిపారు. రిటైర్డ్ కమిషనర్ మోహన్‌రెడ్డి రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. అనంతరం విజేతలకు నగదుతో పాటు హనుమా అవార్డ్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎస్ రెడ్డి, అధ్యక్షుడు ముబ్బు సూర్యనారాయణరెడ్డి, ప్రతినిధులు విజయకుమార్, గురుస్వామి, మర్ధం గజేంద్ర, ధర్మయ్య, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నాటక పోటీ విజేతలు వీరే

పౌరాణిక పద్యనాటక పోటీలలో ప్రథమ బహుమతిని విజయవాడ డాక్టర్ రామన్ ఫౌండేషన్ శ్రీసాయిబాబా నాట్యమండలి వారి మాధవ వర్మ పౌరాణిక నాటకం అందుకుంది. హైదరాబాద్ శ్రీమురళీ కృష్ణ కళా సంస్థ వారి వసంత రాజకీయం పౌరాణి నాటకం ద్వితీయ బహుమతి, కర్నూలు టీజీవీ కళాక్షేత్రం వారి శ్రీకృష్ణ కర్ణార్జునీయం పౌరాణిక నాటకం తృతీయ బహుమతి అందుకుంది. సాంఘిక నాటిక విభాగంలో ఏలూరు హేలాపురి కల్చరల్ అసోసియేషన్ వారి మనసున మనసై ప్రథమ బహుమతిని, అమలాపురం రసవాహిని వారి స్వీకారం ద్వితీయ బహుమతి, గుంటూరు అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ వారి నాన్నా నేనొచ్చేస్తా తృతీయ బహుమతిని కైవసం చేసుకుంది. శాస్త్రీయ, జానపద బృంద నృత్య పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన బృందాలను బహుమతులు అందజేశారు. అలాగే వివిధ విభాగాలలో ఉత్తమ అవార్డులతో కళాకారులను సత్కరించారు.



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,430
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,517
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.75,800
రిటైల్ వెండి గ్రాము	రూ.77.80

ఘనంగా సాయినాథుని ఊరేగింపు

శ్రీకాళహస్తి : పట్టణంలోని సాయిబాబా సత్సంగ కేంద్రం 20వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం సాయంత్రం సాయినాథుని ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. సాయిబాబా, శరత్ బాబుజీ చిత్రపటాలను పురవీధుల్లో ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి డ్రైవర్ల సమస్యలు

చిత్తూరు కలెక్టరేట్ : వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పన్నీర్ సెల్వం అన్నారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌లో డ్రైవర్లకు విశ్రాంతి భవనం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం ఆగ్రో శాఖ లో పనిచేస్తూ బదిలీ అయిన డ్రైవర్ గంగాధరంను సన్మానించారు. సంఘ నాయకులు షణ్ముగం, రామన్న, రోషన్‌భాషా, బాలాజీ, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

లారీ, బైక్ ఢీకొని దంపతులకు గాయాలు

మదనపల్లె సిటీ : లారీ, బైక్ ఢీకొని భార్య,భర్త గాయపడిన సంఘటన గుర్రంకొండ మండలం చిట్టిబోయనపల్లె వద్ద ఆదివారం జరిగింది. చిత్తూరు జిల్లా సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి పంచాయతీ నాగిళ్లవారిపల్లెకు చెందిన రెడ్డిశేఖర్(35), భార్య ప్రసన్నలక్ష్మి(30)లు గుర్రంకొండ వద్దనున్న రెడ్డమ్మకొండ దర్శనం కోసం ద్విచక్రవాహనంలో బయలుదేరారు. చిట్టిబోయనపల్లె వద్ద ఎదురుగా వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో రెడ్డిశేఖర్, ప్రసన్నలక్ష్మి గాయపడ్డారు. వారిని 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కట్నం వేధింపులపై ఫిర్యాదు

పలమనేరు: తన భర్త వెంకటేశ్వర్లు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన రూప ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమకు 2010లో వివాహం జరిగిందని, ఇద్దరు పిల్లలున్నారని పేర్కొంది. టీచర్‌గా పనిచేస్తున్న తన భర్త అదనపు కట్నం వేధిస్తున్నారని ఫిర్యాదులో తెలిపింది. పోలీసులు విచారిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల విజేత తిరుపతి





ప్రథమ స్థానం సాధించిన తిరుపతి క్రీడాకారులకు ట్రోఫీ అందిస్తున్న దినేష్‌కుమార్ , ద్వితీయ స్థానం సాధించిన అనంతపురం క్రీడాకారులతో దినేష్‌కుమార్

- అనంతపురానికి ద్వితీయ స్థానం
- తృతీయ స్థానంలో నిలిచిన అనకాపల్లి, విశాఖ జిల్లాలు

అనకాపల్లి టౌన్: విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని జాతీయ గ్రాప్లింగ్ (కుస్తీ పోటీలు) అసోసియేషన్ చైర్మన్ దినేష్‌కుపూర్ తెలిపారు. స్థానిక గవరపాలెం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి మూడో సబ్ జూనియర్ గ్రాప్లింగ్ పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాయని, విద్యార్థులు వారికి నచ్చిన దాంట్లో ప్రతిభ సాధించాలని సూచించారు. విద్యతోపాటు, క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు పొందవచ్చని చెప్పారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన 600 మంది క్రీడాకారుల పాల్గొన్నారు. తిరుపతి జిల్లా ప్రథమ స్థానం, అనంతపురం జిల్లా ద్వితీయ, అనకాపల్లి, విశాఖ జిల్లాలు తృతీయ స్థానం సాధించాయి. పోటీలు అనంతరం విజేత క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు పద్మనాభం, సీనియర్ క్రీడాకారులు లక్ష్మణరావు, కె.ఎస్.వి.సత్యనారాయణ, గ్రాప్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి, పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.జ్యోతిర్మయి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా



కార్తీక్ మృతదేహం

చంద్రగిరి(తిరుపతి రూరల్) : మండలంలోని రెడ్డివారిపల్లె వద్ద స్వర్ణముఖి నదిలో ఆదివారం ఈతకు వెళ్లి ఓ విద్యార్థి మృతి చెందాడు. వివరాలు.. కర్నూలు జిల్లాకు చెందిన కార్తీక్(19) చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లె సమీపంలోని వెంకట పద్మావతి మెడికల్ కళాశాలలో ఫిజియోథెరపీ సెకండియర్ చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి స్వర్ణముఖి నదిలో ఈతకు వెళ్లాడు. లోతు ఎక్కువగా ఉండటంతో మునిగిపోయాడు. స్నేహితులు కాపాడేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. విద్యార్థుల కేకలు విన్న స్థానికులు నదిలో దిగి కార్తీక్ మృతదేహాన్ని వెలికి తీశారు. సీఐ రాజశేఖర్ ఘటనాస్థలానికి చేరుకుని విద్యార్థి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం తిరుపతిలోని మెడికల్ కళాశాల తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అక్రమార్కులు నదిలో ఇసుకను తవ్వేయడం వల్లే పెద్ద గుంతలు ఏర్పడ్డాయని, అందులో పడే విద్యార్థి మరణించాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన ఇసుక అక్రమ తరలింపును అరికట్టాలని కోరుతున్నారు.

యువతి అదృశ్యం

నదుం: యువతి అదృశ్యంపై ఫిర్యాదు అందినట్టు ఎస్ఐ మారుతి ఆదివారం తెలిపారు. మండలంలోని కొత్తపల్లెకు చెందిన యువతి(17) రెండు వారాలుగా కనిపించడం లేదని తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

వెంకటగిరి : పట్టణంలోని తారకరామా క్రీడా ప్రాంగణంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న సౌత్‌జోన్ సీనియర్ మహిళల క్రికెట్ పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. గ్రౌండ్1లో నెల్లూరు- కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 39.2 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసి గెలుపొందింది. గ్రౌండ్ 2లో కడప- చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. కడప జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 40.5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసి విజయం సాధించింది.



సెంచరీ సాధించిన నెల్లూరు జట్టు క్రీడాకారిణి ఐశ్వర్యరాయ్



బౌలింగ్‌లో సత్తా చాటిన కడప జట్టు క్రీడాకారిణి వైష్ణవి

అత్యాశకు పోతే ఖాతా ఖాళీ

- చిత్తూరు రామ్‌నగర్ కాలనీకి చెందిన రోహిత్ పింక్ వాట్సప్ బాధితుడు. ఇతని ఖాతాలో ఏకంగా రూ.80 వేలను సైబర్ కేటుగాళ్లు కొట్టేశారు.
- స్టాక్ మార్కెట్‌లో రూ.10 వేలు పెట్టుబడి పెడితే నాలుగు రోజుల్లో రూ.50 వేలను శాంతిపురం మండలం రాళ్లబుదుగూరు బాలచంద్ర ఖాతాకు జమ చేశాడో ఆన్‌లైన్ మోసగాడు. అత్యాశకు పోయిన బాలచంద్ర దఫాలుగా రూ.4.90 లక్షలు గుర్తుతెలియని వ్యక్తికి చెల్లించి మోసపోయి పోలీసులను ఆశ్రయించాడు.
- పలమనేరులోని సిద్దార్థ బీటెక్ పూర్తిచేసి నెలకు రూ.60 వేల జీతం కోసం బెంగళూరులో ఐటీ కంపెనీలో చేరడానికి జాబ్ కన్సల్టెన్సీ ద్వారా ఓ అజ్ఞాత వ్యక్తి చెప్పిన ఖాతాకు రూ.1.80 లక్షలు జమచేసి చేతులు కాల్చుకున్నాడు.
- తిరుపతికి చెందిన మమతకు ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో వెబ్‌సిరీస్, కొత్త సినిమాలు చూడడం అలవాటు. ఎలాంటి చందాలేకుండా ఏడాదిపాటు ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు చూసేందుకు ఓ లింకు ప్రెస్‌చేస్తే వచ్చే ఓటీపీ చెబితే చాలని ఆమెను మభ్యపెట్టిన మహిళా గొంతు.. మమత ఖాతాలో ఉన్న రూ.3.26 లక్షలు నొక్కేసింది.


ఇవి ఉదాహరణలు మాత్రమే. సైబర్ మోసగాళ్ల వలలో పడిన బాధితులు ఎంతోమంది ఉన్నారు. పోలీసుల దృష్టికి రానివి ఎన్నో.

- 'టెకీ' మోసాల్లో కొత్త పుంతలు..!
- గులాబీ లింకులు.. ఓటీటీ చందాలతో లూటీ
- ఐటీ ఉద్యోగాలంటూ మధ్యవర్తిత్వం మోసాలు
- స్టాక్ మార్కెట్ షేర్ల పేరిట సొమ్మంతా ఖాళీ
- జిల్లాలో పెరుగుతున్న బాధితులు

చిత్తూరు అర్బన్: జిల్లాలో ఇటీవల వెలుగుచూస్తున్న పలు సైబర్ నేరాలు మోసాలు చేయడంలో ఆధునిక పోకడకు అద్దం పడుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రూపంలో సంకేతాల ద్వారానే ఆజ్ఞలు ఇచ్చేస్తోంది. టెక్నాలజీలో మోసగాళ్లు కూడా అప్‌డేట్ అయ్యారు. చేతిలో స్మార్ట్ ఫోన్ పెట్టుకుని అమాయకుల ఖాతా నుంచి డబ్బులు దోచేస్తున్నారు.. ప్రజలు అత్యాశకు పోయి మోసపోతున్నారు. పోలీసుశాఖ ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా మోసగాళ్ల వలలో అమాయకులు చిక్కుకుని లక్షలకు లక్షలు పోగొట్టుకుంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అడ్డుపెట్టుకోవడంతో పాటు ఎదుటివారి మానసిక పరిస్థితిని అంచనా వేస్తూ కొత్త తరహా దొంగలు పంజా విసురుతున్నారు. అసాధారణమైన ధనాన్ని ఆశ చూపించి ఉచ్చులో పడేస్తున్నారు. నిత్యం స్మార్ట్ ఫోన్‌లో ఉపయోగించే వాట్సాప్ యాప్‌ను సరికొత్త రూపొందించామంటూ పింక్ వాట్సప్‌ను ఓపెన్ చేయమని ఓ మెసేజ్ ఫార్వర్డ్ అవుతుంది. దాన్ని ఓపెన్ చేస్తే మన మొబైల్‌లో ఉన్న సమాచారం మొత్తం వెళ్లిపోవడంతో పాటు ఫోన్ పే, గూగుల పే లాంటి డిజిటల్ లావాదేవీల పాస్‌వర్డ్ కూడా ఎదుటివాళ్లు తీసేసుకుంటారు. మనకు మునుపెన్నడూ పరిచయంలేని వ్యక్తి నుంచి అనవసరమైన కాల్స్, లింకులు రావడం, ఓటీపీ చెప్పమని అడగడం లాంటి మెసేజ్‌లు వస్తే ఒక్క క్షణం అక్కడే ఆగి ఆలోచిస్తే అసలు సమస్యే ఉండదు. మనం ఎవరో కూడా తెలియని వ్యక్తి మనకు రూ.లక్షలు ఊరికే ఇస్తామని ఎందుకు చెబుతున్నాడు..? ఇందులో ఏదైనా మోసం ఉందా..? ఆ మెసేజ్‌లకు, ఫోన్లకు నేను ప్రతిస్పందించాలా..? అని ఆలోచిస్తే చాలు.. ఎలాంటి మోసం జరగకుండా నిరోధించవచ్చు. ఇంకా అవసరమైతే సైబర్‌సెల్ టోల్‌ఫ్రీ నెం-1930, www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా మరొకరు ఈ మోసాలకు గురికాకుండా సాయం చేసినట్లవుతుంది.



అప్రమత్తత అవసరం



“సైబర్ నేరాలు కొత్త కొత్త పద్ధతుల్లో విస్తరిస్తున్నాయి. దీన్ని ఛేదించేందుకు పోలీసుశాఖ సిద్ధంగా ఉంది. సరికొత్త సవాళ్లను ఎదుర్కొని నేరగాళ్లను పట్టుకునేందుకు శిక్షణ ఇస్తూ సన్నద్ధం చేస్తున్నాం. నేరం జరిగాక చర్యలకన్నా.. నేరం జరగక ముందే జాగ్రత్త వహించడం మంచిది. ఇందుకు ప్రజల సహకారం అవసరం. అనవసరమైన లింకులు క్లిక్ చేయడం, నేరుగా పరిచయం లేని వ్యక్తులకు రూ.లక్షల్లో డబ్బులు ముట్టచెప్పడం లాంటి ఘటనలు సైబర్ నేరాల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలుస్తోంది. ప్రజల్లో మార్పు వస్తేనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది.

– వై.రిషాంత్‌రెడ్డి, ఎస్పీ, చిత్తూరు

తిరుమల, తిరుపతి ప్రాశస్తిలో యాదవుల పాత్ర ఎనలేనిది

తిరుపతి కల్చరల్: తిరుమల, తిరుపతి అభివృద్ధి, ప్రాశస్తిలో యాదవుల పాత్ర ఎనలేనిదని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. టీఎంఆర్ కల్యాణ మండపంలో ఆదివారం అఖిల భారత యాదవ మహాసభ తిరుపతి జిల్లా ప్రథమ సమావేశం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే భూమన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిని 900 ఏళ్ల నుంచే యాదవ రాజులు పరిపాలించారని తెలిపారు. యాదవుల పిలుపు మేరకే రామానుజాచార్యులు తిరుపతిని నిర్మించడంతో పాటు తిరుమలలో అర్చకత్వం స్థిరం చేశారని పేర్కొన్నారు. 1252లో వీర నరసింగ యాదవరాజు తిరుమలలో మండపం రూపంలో నున్న ఆలయాన్ని 10 అడుగులు పెంచడంతోపాటు గోపురాన్ని నిర్మించి నిలువెత్తు బంగారు తాపడం చేయించారని తెలిపారు. 150 ఎకరాల భూమిని తిరుమలకు మాన్యంగా ఇచ్చి వచ్చే ఆదాయంతో నిత్యం అన్నదానం చేయించాలని పేర్కొన్నారని తెలిపారు. వీరనరసింగ యాదవరాజు పేరును కొర్లగుంట రోడ్డుకు నామకరణం చేయనున్నట్లు తెలిపారు. తిరుమల శ్రీవారిని తొలుత గుర్తించి దర్శించుకున్న శరబయ్య పేరును తిరుపతి మాస్టర్ ప్లాన్ రోడ్డుకు నామకరణం చేయిస్తానని తెలిపారు. యాదవులు ఐక్యతతో ముందడుగు వేస్తూ సమాజ శ్రేయస్సులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మేయర్ శిరీష మాట్లాడుతూ తిరుమల శ్రీవారి తొలిదర్శన భాగ్యం యాదవులకు భగవంతుడు ఇచ్చిన వరమని తెలిపారు. తిరుమలలో సన్నిధి గొల్ల సమస్యను ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారని కొనియాడారు. తిరుపతిలో మేయర్ పదవితో పాటు టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్, గంగమ్మ ఆలయ చైర్మన్ పదవులను యాదవులకు ఇచ్చారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి సహకారం అందించాలని కోరారు. అఖిల భారత యాదవ మహాసభ జాతీయ అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షుడు పీరయ్య యాదవ్, జిల్లా అధ్యక్షుడు వాసు యాదవ్, గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, శివప్రసాద్‌యాదవ్, అరుణ్ యాదవ్, భరణి యాదవ్, చింతా రమేష్ యాదవ్, ఈతమాకుల హేమంత్ యాదవ్, నితిన్ యాదవ్ పాల్గొన్నారు.



యాదవ మహా సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

నేడు డయల్ యువర్ కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ హరిత తెలిపారు. ప్రజలు ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు 0877–2227208 కాల్‌చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు. అలాగే ఉదయం 10:30 నుంచి నేరుగా అధికారులను కలిసి ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు.

నేడు దర్గాలో రొట్టెల పండుగ

శ్రీకాళహస్తి: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా హజ్రత్ జూమ్లే షాపీర్ దర్గాలో సోమవారం సాయంత్రం రొట్టెల పండుగకు ఏర్పాటు చేస్తున్నట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు. మతసామరస్యానికి ప్రతీక అయిన ఈ దర్గాలో మతాలకు అతీతంగా భక్తులు పాల్గొంటారని చెప్పారు.

నిత్యాన్నదానానికి రూ.75 వేల విరాళం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌కు చెందిన భక్తుడు నాగేశ్వరరావు ఆదివారం రూ.75 వేలు విరాళం ఇచ్చారు. నగదును ఆలయ కార్యాలయంలో ఏఈఓ సతీష్ మాలిక్, సూపరింటెండెంట్ విజయసారథికి అందజేశారు. అధికారులు వారికి స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందజేశారు.

తిరునగరిపై మేఘమాలిక..



అల్పపీడనం ప్రభావంతో గడిచిన మూడు రోజులు తిరుపతిలో చిరుజల్లులు పడ్డాయి. వర్షం తెరిపి ఇవ్వడంతో మేఘావృతమైన ఆకాశం నీలి రంగులోకి మారిపోయింది. వెండి మబ్బులు ఉప్పెన ఎగసి పడుతున్నట్టు కనిపించి నగర వాసులకు కనువిందు చేశాయి. - సాక్షి ఫొటో గ్రాఫర్, తిరుపతి

భక్తిప్రపత్తులతో అగ్నిగుండ మహోత్సవం

పిచ్చాటూరు: ధర్మరాజుస్వామి ఆలయ తిరునాళ్లలో భాగంగా ఆదివారం సాయంత్రం భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అంతకు ముందు ఉదయం 7 గంటలకు భీముడు, ధుర్యోధునుని వధించే ఘట్టాన్ని కళాకారులు రక్తి కట్టించారు. 9 గంటలకు అలుగు ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం దీక్షాపరులు ఏడు ఎల్లలు నడిచి అక్కడి బావుల్లో పుణ్య స్నానాలు ఆచరించి స్థానిక గ్రామ దేవత గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి విశ్వరూపిణి అలంకారంలో ఉన్న ద్రౌపదీ అమ్మవారితో కలిసి ఊరేగింపుగా ధర్మరాజు ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం వద్ద ద్రౌపదీ అమ్మవారిని అగ్నిగుండం అభిముఖంగా ఉంచి దీక్షాపరులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. రాత్రి అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. కేరళ కళాకారుల వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పిచ్చాటూరు, నారాయణవనం ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, పరమేశ్వర్ నాయక్, సునీల్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

ఘనంగా భూమన అభినయ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

- వాడవాడలా అన్నదానం, సేవా కార్యక్రమాలు



మన తిరుపతి- మన అభినయ్ సీడీని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తిరుపతి మంగళం: తిరుపతి నగరం అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత తిరుపతిలో ఘనంగా జరుపుకున్నారు. ఎంఆర్‌పల్లి వద్ద తిరుపతి 19వ డివిజన్ కార్పొరేటర్ ఆరణి సంధ్య ఆధ్వర్యంలో మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కె.బాబు, టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నరిసింహ ఆచారి, నరేంద్ర, తిరుపతి మునిరామిరెడ్డి, తిరుత్తణి శైలజ, సీకె. రేవతి, ఉమా అజయ్, హనుమంత్‌నాయక్, శేఖర్ రెడ్డి, నారాయణ, టౌన్ బ్యాంకు డైరెక్టర్లు మబ్బు నాదమునిరెడ్డి, రేమాల బ్రహ్మానందరెడ్డి, వెంకటేష్ రాయల్, గంగమ్మ ఆలయ సభ్యులు పడమటి కుమార్, వెంకటేష్, ధనశేఖర్, నాయకులు పాముల రమేష్‌రెడ్డి, అజయ్‌కుమార్, కంకణాల రమేష్, తలారి రాజేంద్ర, ఉదయగిరి రమేష్, నాథముని, తిమ్మారెడ్డి, మనోహర్ భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం తన తిరుపతి–మన అభినయ్ పాట సీడీని ఆవిష్కరించారు.

ముద్రనారాయణ, ఎస్‌కె.బాబు ఆధ్వర్యంలో...

భూమన అభినయ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా తిరుపతి ఎస్టీవీనగర్ వద్ద డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కె. బాబు, కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు ఆధ్వర్యంలో వెయ్యిమంది పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నల్లాని బాబు, తాలూరి ప్రసాద్, కడపగుంట అమరనాథ్‌రెడ్డి, ఉదయగిరి రమేష్, రావూరిప్రసాద్, శివ పాల్గొన్నారు.

దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి ఆధ్వర్యంలో...

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయం సమీపం వద్ద తిరుపతి 11వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి ఆధ్వర్యంలో వందలాది మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, ఎగ్జిబిషన్ శ్రీనివాసులు, కార్పొరేటర్ నరిసింహ ఆచారి, తులసీయాదవ్, తిరుమలరెడ్డి, ధనశేఖర్ పాల్గొన్నారు.

తిరుపతి మునిరామిరెడ్డి ఆధ్వర్యంలో...

తిరుపతి 8వ డివిజన్ కొర్లగుంట వద్ద కార్పొరేటర్ తిరుపతి మునిరామిరెడ్డి ఆధ్వర్యంలో వందలాది మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శేఖర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు వెంకట్‌రెడ్డి, పార్టీ నాయకులు మురళి, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

దినేష్‌రాయల్ ఆధ్వర్యంలో...

తిరుపతి దేవేంద్ర థియేటర్ సమీపంలో తిరుపతి 35వ డివిజన్ అధ్యక్షుడు దినేష్‌రాయల్, చెందురాయల్ ఆధ్వర్యంలో వందలాది మంది పేదలకు అన్నదానం చేశారు.

ఎస్వీ యూనివర్సిటీలో

తిరుపతి సిటీ: తిరుపతి నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఎస్వీ యూనివర్సిటీలో ఘనంగా జరుపుకున్నారు. ఇందులో కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ భూమన అభినయ్‌రెడ్డి తిరుపతి నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్వీయూ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మురళీరెడ్డి, ప్రేమ్‌కుమార్, శ్రీనివాసరావు, గౌరి, గౌతమి, లోకేష్, ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్‌నాయుడు పాల్గొన్నారు.





పేదలకు అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్‌కె. బాబు, కార్పొరేట్ కోటూరు ఆంజనేయులు



ఎస్వీయూలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నేతలు

కలిపింది అందరినీ ఇన్‌స్టాగ్రామ్

సోషల్ మీడియా వేదికలు చెడునే కాదు మంచికీ ఉపయోగపడుతున్నాయని చెప్పడానికి తిరుపతిలో ఆదివారం జరిగిన సంఘటనే నిదర్శనం. ఒకే అభిప్రాయం, అభిరుచులు కలిసిన సుమారు 50 మందికి పైగా యువతీ యువకులు ఇన్‌స్టాగ్రామ్‌లో తిరుపతికి చెందిన అవినాష్ ఆధ్వర్యంలో గ్రూపుగా ఏర్పడ్డారు. వారు ఆదివారం ఎస్వీ యూనివర్సిటీ ఆవరణలో సమావేశమయ్యారు. వారి కుంచె నుంచి జాలువారిన చిత్రాలను ప్రదర్శించి అబ్బురపరిచారు. తమలో ఉన్న ప్రతిభను, నైపుణ్యాలను ఇతరులకు పంచుతూ ఒకే వేదికపై ఇలా కలుసుకోవడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



ప్రజాదరణను చూసి తట్టుకోలేకే విమర్శలు

- మంచి చేస్తే ప్రజలు గుండెల్లో గూడు కట్టుకుంటారు
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- 19వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం


సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేకే ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ ఆరణి సంధ్యతో కలిసి 19వ డివిజన్ ఎంఆర్‌పల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి వారు పొందిన పథకాలు, లబ్ధిని వివరించారు. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలో ఎవరూ అందించలేనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని తెలిపారు. మంచి చేస్తే ప్రజలు గుండెల్లో గూడు కట్టుకుంటారని తెలిపారు. వివిధ పథకాలతో కుటుంబాలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రికి ప్రజలు తమ గుండెల్లో గూడు కట్టుకున్నారని వివరించారు. పేదలకు చిన్నపాటి సంక్షేమాన్ని అయినా అందించావా చంద్రబాబు ప్రజలు నిన్ను ఆదరించడానికి అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా అదే ప్రాంతానికి చెందిన రజని అనే మహిళ మాట్లాడుతూ తన బిడ్డ గౌతమ్ డెంగీ జ్వరంతో బాధపడుతూ లివర్ పాడై ప్రాణాపాయ స్థితికి చేరుకున్న సమయంలో సాయం కోసం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని ఆశ్రయించామని తెలిపారు. ఆయన 8 గంటల్లోనే సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.10 లక్షల వచ్చేలా చేశారని తెలిపారు. తన బిడ్డకు ప్రాణదానం చేసిన ఎమ్మెల్యేకు జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కె.బాబు, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు మబ్బు నాదమునిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వెంకటేష్‌రాయల్, తిమ్మారెడ్డి, పడమటి కుమార్, తలారి రాజేంద్ర, కిషోర్, సద్దాబాబు, కై లాస్, రవి, నారాయణ, ఉమాపతి, జయచంద్రారెడ్డి, నాగయ్య, ధనుంజయ, కంకణాల రమేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన


కుంట్రపాకంలో ఉచిత ఆరోగ్య పరీక్షలను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి


రణధీర్‌పురంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటికే చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, రామచంద్రాపురం, పాకాల మండలాల్లో వైద్య శిబిరాలను విజయవంతంగా నిర్వహించారు. ఆదివారం తిరుపతి రూరల్ మండలం సీగొల్లపల్లి, తనపల్లి, బీటీఆర్ కాలనీ, పాడిపేట పంచాయతీల్లో ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో స్థానికులు తరలి వచ్చి వైద్య పరీక్షలను చేయించుకున్నారు. తమ ఆరోగ్య పరిరక్షణ కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంటికే వచ్చి ఆరోగ్య పరీక్షలను చేయిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మోహిత్‌రెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, ఎంపీడీవో వెంకటనారాయణ, సర్పంచులు ధనముని రెడ్డి, రవి, శుభపద్మానాభరెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరం పరిశీలన

తిరుపతి మంగళం: మంగళం రణధీర్‌పురం పంచాయతీలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ పంచాయతీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పరిశీలించారు. వైద్య శిబిరంలో రూ.4 వేల విలువైన వైద్య పరీక్షలను ఉచితంగా చేసి మందులు అందజేస్తున్నట్టు తెలిపారు. వైద్య శిబిరం మూడు రోజుల పాటు ఉంటుందని, ఈ అవకాశాన్ని పంచాయతీ ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, ఉపసర్పంచ్ మల్లెమొగ్గల ఉమాపతి, అధ్యక్షులు రజాక్ పాల్గొన్నారు.

సంతలో అన్నదానం


అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరిలో ఆదివారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ చంద్రగిరి డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో వారపు సంతల్లో రైతులు, వ్యాపారులు రుసుం చెల్లించకుండా చెవిరెడ్డి సొంత నిధులు వెచ్చించారని తెలిపారు. సంతకొచ్చు రైతులకు, ప్రజలకు, మహిళలకు అన్నదానం చేస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, కోటీశ్వర్ రెడ్డి, నవీన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి కంచుకోట కుంట్రపాకం


అవినాష్‌రెడ్డిని సత్కరిస్తున్న యూత్ నాయకులు

తిరుపతి రూరల్: వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి కుంట్రపాకం కంచుకోటగా ఉందని ఆ పార్టీ పంచాయతీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన జీపాళెం అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయనను ఆదివారం పంచాయతీ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అంతకుముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బైక్‌ల ర్యాలీగా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. రానున్న ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలుపించుకోవడానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేద్దామని అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు.

తిరుపతి అభివృద్ధిని అడ్డుకుంటే గుణపాఠం తప్పదు


మాట్లాడుదుతున్న తలారి రాజేంద్ర

తిరుపతి కల్చరల్: తిరుపతి నగర అభివృద్ధికి సహకరించకపోగా పసలేని ఆరోపణలు చేస్తూ అడ్డుతగులుతున్న నవీన్‌కుమార్‌రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వైఎస్సార్ సీపీ సేవాదళ్ నేత తలారి రాజేంద్ర హెచ్చరించారు. ఆయన ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తిరుపతి నగరం అభివృద్ధి పథంలో దూసుకెళుతోందన్నారు. ఈ ఘనత డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డికే దక్కుతుందన్నారు. ఎస్వీయూనివర్సిటీ మీదుగా స్విమ్స్, ప్రసూతి ఆసుపత్రి, బర్డ్ ఆసుపత్రులను అనుసంధానిస్తూ రోడ్లు వేస్తే అసాంఘిక కార్యక్రమాలు పెరుగుతాయని నవీన్‌కుమార్‌రెడ్డి చెప్పడం శోచనీయమన్నారు. తన ఉనికిని చాటు కునేందుకే ఇలాంటి విమర్శలకు దిగుతున్నారని దుయ్యబట్టారు. టీటీడీపై కోర్టును ఆశ్రయించి మొటిక్కాయలు తిన్నా బుద్ధి రాలేదన్నారు. ఇప్పటికైనా నవీన్‌కుమార్‌రెడ్డి విమర్శలు మానుకుని తిరుపతి నగర అభివృద్ధికి సహకరించాలని సూచించారు. వెంకటముని, రాజశేఖర్, శ్యామల, నరసింహులు, బాబు యాదవ్, శారద, సతీష్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోండి


మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు

చంద్రగిరి(తిరుపతి రూరల్): మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకుని తగిన గుర్తింపు ఇవ్వాలని ఆ సంఘం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. చంద్రగిరి ఎంఈవో కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్ల అసోసియేషన్ అధ్యక్షురాలు నాగరాణి, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకురాలు లలితమ్మ, ప్రేమ, చంద్రగిరి కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం పండుగ


పులి వేషాలు ధరించిన నాగూర్ కాలనీ వాసులు

రామచంద్రాపురం: మండలంలోని నెన్నూరు గ్రామంలో ఆదివారం మొహర్రం పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పీర్లను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం పంచాయతీ నాగూర్ కాలనీ వాసులు ధరించిన పులి వేషాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పండుగలో పాల్గొన్న పరిసర ప్రాంత ప్రజలకు అన్నదానం చేపట్టారు.

ఘనంగా డాలర్స్ గ్రూప్ 10వ వార్షికోత్సవం

చంద్రగిరి(తిరుపతి రూరల్): డాలర్స్ గ్రూప్ 10వ వార్షికోత్సవాన్ని ఆదివారం చంద్రగిరిలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డాలర్స్ గ్రూప్ అధినేత దివాకర్ రెడ్డి తిరుపతి నుంచి భారీ స్కూటర్, ఆటో ర్యాలీతో చంద్రగిరి చేరుకున్నారు. ఆయనను పలువురు ఘనంగా సత్కరించారు. సినీ, టీవీ కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దివాకర్ రెడ్డి మాట్లాడుతూ తమ కస్టమర్లు, అభిమానులు, చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు ఎంతోమందికి సాయం చేశానని, తమ పైన అభిమానంతో వచ్చిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని వెల్లడించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అభిమానులు ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం ఆటో కార్మికులకు సొంత నిధులతో ప్రమాద బీమా చేయించారు.

సీఎం నిర్ణయం చారిత్రాత్మకం


సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఉద్యోగ సంఘం నేతలు

తిరుపతి సిటీ: ఉద్యోగులకు ఏ రాష్ట్ర ప్రభుత్వమూ చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈఎల్స్ వర్తించే విధంగా జీవో 20 విడుదల చేయడం గర్వంచదగ్గ విషయమని ఎస్వీయూ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి భాస్కర్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం ఎస్వీయూ పరిపాలన కార్యాలయం వద్ద అధ్యాపకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. జీవో 39 విడుదల చేసి టీచింగ్ అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయసును 62 నుంచి 65 ఏళ్లకు పెంచారని తెలిపారు. అలాగే ఇది వరకు రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేపట్టని ఎన్‌యాండ్స్‌మెంట్ లీవ్‌ను కల్పించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీ అధ్యాపకులు సీఎంకు రుణపడి ఉంటారని తెలిపారు. నాన్‌టీచింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ త్వరలో నాన్‌టీచింగ్ ఉద్యోగులకు కూడా 60 నుంచి 62 ఏళ్లకు వయోపరిమితిని పెంచుతూ త్వరలో జీవో విడుదల కానుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఉద్యోగులు ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ స్టేట్ ప్రెసిడెంట్ కే.మురళీరెడ్డి పాల్గొన్నారు.

చంద్రగిరిలో ఇసుక రీచ్‌ల నిలిపివేత


మాట్లాడుతున్న తహసీల్దార్

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలంలోని నాగయ్యగారిపల్లి, రెడ్డివారిపల్లెలో ఇసుక రీచ్‌లను నిలిపివేస్తున్నట్లు తహసీల్దార్ శిరీష, సీఐ రాజశేఖర్ తెలిపారు. ఆమె ఆదివారం మాట్లాడుతూ ఇసుక రీచ్‌లను నిలిపివేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇసుక రీచ్‌లలోకి ఎవరినీ అనుమతించడం లేదని, ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక రీచ్‌ల వద్ద పర్యవేక్షించాలని రెవెన్యూ, పోలీసు అధికారులను ఆదేశించారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి కల్చరల్: విద్యుత్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వివిధ జాతీయ ట్రేడ్‌యూనియన్ల నేతలు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గంధమనేని శివయ్య భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూ, సీఐటీయూ సంఘాల నేతలు పాల్గొని విద్యుత్ కార్మిక సంఘాలు చేపడుతున్న పోరాటానికి మద్దతు తెలిపారు. ఏపీ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నేత జైమణి మాట్లాడుతూ విద్యుత్ అధికారులు కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా వినియోగదారులపై తీవ్ర భారం మోపుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రయివేటు పరం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా జరిగే పోరాటానికి అన్ని కార్మిక సంఘాలు కలిసి రావాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాక్రిష్ణ, కుమార్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కందారపు మురళి, ఐఎన్‌టీయూసీ రత్నకుమార్, టీఎన్‌టీయూసీ నేత నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వాలు కుట్రపూరితంగా విద్యుత్ సంస్థలను ప్రయివేటు పరం చేసే ప్రయత్నం సాగిస్తోందన్నారు. ఫలితంగా ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. విద్యుత్ సంస్థను కాపాడుకోవడం ప్రజలందరి కర్తవ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, వివిధ కార్మిక సంఘాల నేతలు శివప్రసాద్, సీహెచ్ శివ, వైఎస్.మణి, ఎన్‌డీ.రవి, వి.నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.